సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 17 । ఆగస్టు । 2023



సోమశిలలో 21.03 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 21.030 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంది 655 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,680
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,449
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,612
నవర (8 గ్రాములు)	రూ.44,896

గరిష్టం/కనిష్టం
38.4 /28.0

వాతావరణం

వాతావరణంలో తేమ 42 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా ఎండ తీవ్రత గురువారం అధికంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నేడు

నెల్లూరు(పొగతోట): జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలను గురువారం ఉదయం 10.30 నుంచి జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నామని సీఈఓ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సమావేశాలను నిర్వహించనున్నామని చెప్పారు. జెడ్పీ సభ్యులు, ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

డ్వామా ఏపీడీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (పొగతోట): డ్వామా అడిషనల్ పీడీగా సుజాత బాధ్యతలను బుధవారం స్వీకరించారు. ప్రకాశం జిల్లా కనిగిరి ఏపీడీగా పని చేస్తున్న ఈమెను నెల్లూరు డ్వామా అడిషనల్ పీడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

స్వే మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లాకు పతకాలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): శ్రీకాకుళంలో ఇటీవల నిర్వహించిన స్వే మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారని స్వే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు. అండర్ – 11, 14 విభాగాల్లో జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు పాల్గొనగా, నాలుగు స్వర్ణ, నాలుగు రజత, మూడు కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు.

ఉద్యాన పంటల అభివృద్ధికి తోడ్పాటు



పంటలను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ఉద్యాన పంటల అభివృద్ధికి తగిన తోడ్పాటునందిస్తున్నామని వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గుడిపల్లిపాడులోని ఉద్యాన క్షేత్రాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉద్యానపరంగా రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ పంటల ద్వారా రైతులకు ఎనలేని లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు 19న పోలింగ్

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, 12 వార్డు స్థానాలకు పోలింగ్‌ను శనివారం నిర్వహించనున్నామని కలెక్టర్ హరినారాయణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదంకి మండలం లింగరాజు అగ్రహారానికి సర్పంచ్ పదవి.. జలదంకి, కోవూరు, ఉలవపాడు, కొండాపురం, లింగసముద్రం, మనుబోలు, చేజర్ల, రాపూరు, తదితర మండలాల్లో ఖాళీగా ఉన్న 12 వార్డు స్థానాలకు పోలింగ్‌ను నిర్వహించనున్నామన్నారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్‌ను నిర్వహించి, మధ్యాహ్నం రెండు నుంచి ఓట్లను లెక్కించనున్నామని వివరించారు.

హుండీ కానుకల లెక్కింపు



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన కామాక్షితాయి ఆలయంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 86 రోజులకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించగా, రూ.45,01,335 మేర భక్తులు సమర్పించారు. యూఎస్ డాలర్లు 48, సౌదీ రియాల్స్ 52, యూఏఈ దిర్హమ్స్ 10, సౌతాఫ్రికా రాండ్స్ 100, సింగపూర్ డాలర్స్ 10 మేర హుండీలో ఉన్నాయి. 161.800 గ్రాముల బంగారు ఆభరణాలు, 506.800 గ్రాముల వెండి వస్తువులను భక్తులు సమర్పించారు. అన్నదాన హుండీలో రూ.1,94,173 మేర నగదు వచ్చిందని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఈఓ వెంకటేశ్వర్లు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, పాలకమండలి సభ్యులు గుమ్మా రఘురామయ్య పాల్గొన్నారు.

జలసిరులు



గత ప్రభుత్వ హయాంలో వర్షాలు అంతంతమాత్రంగా పడి.. ప్రాజెక్టులు నిండక.. పంటలు సక్రమంగా పండక రైతులు నానా కష్టాలు పడ్డారు. అయితే గత నాలుగేళ్లలో వర్షాలు పుష్కలంగా పడి జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నీరు సమృద్ధిగా ఉండటంతో పంటలు బాగా పండి అన్నదాతలు ఖుషీఖుషీగా ఉన్నారు. గతేడాది రికార్డు స్థాయిలో ఏకంగా 17 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి సాధించారు.

- నాలుగేళ్లలో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు
- సోమశిల, కండలేరు ప్రాజెక్టులు కళకళ
- చిన్న, మధ్య తరహా చెరువుల్లో పుష్కలంగా..
- పెరిగిన ధాన్యం ఉత్పత్తులు
- గతేడాదిలో రికార్డు స్థాయిలో 17 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి



సోమశిల జలాశయంలో నీటి పరవళ్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో ఏ జిల్లాకూ లేని నీటి సౌకర్యం నెల్లూరు జిల్లాకు దక్కింది. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో స్వల్ప వర్షాలు కురిసినా, అక్కడి నీరు పెన్నా ద్వారా సోమశిల, కండలేరు ప్రాజెక్టులకు చేరుతోంది. గడిచిన మూడేళ్లుగా సోమశిల నిండుకుండలా దర్శనమిస్తోంది. పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేస్తున్నారు. కండలేరు ప్రాజెక్టు ఇదే స్థాయిలో కనిపిస్తోంది. ఈ తరుణంలో జిల్లాలో సాగునీటికి ఎలాంటి ఢోకా లేకుండా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో 1,746 చిన్న చెరువులు, 104 మధ్య తరహా చెరువులు, 68 పెద్ద చెరువులున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల్లో పుష్కలంగా నీరుండటంతో వ్యవసాయంపై మక్కువ పెరుగుతోంది.

గతంలో వెలవెల

నదీ పరీవాహక ప్రాంతం అధికంగా ఉన్నా, గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులకు అరకొరగానే నీరు చేరింది. 2015 – 16 మినహా మిగిలిన నాలుగేళ్లు స్వల్పంగా జలాలు చేరాయి. ఫలితంగా ఆయకట్టు సాగు 50 శాతానికి మించలేదనే అంశం అధికారిక రికార్డుల ద్వారా తెలుస్తోంది. భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటిని ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేయాల్సిన దుస్థితి తలెత్తింది. మంచినీటి రవాణా కోసం 2014 – 19 కాలంలో సుమారు రూ.58 కోట్లను వెచ్చించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సోమశిల జలాల విడుదలిలా..

- ఈ ఏడాదిలో రెండో పంట కోసం ఐఏబీ నిర్ణయం మేరకు సాగునీటిని విడుదల చేశారు. పెన్నార్ డెల్టా, కనుపూరు, కావలి, ఉత్తర కాలువలతో కూడిన సోమశిల ప్రాజెక్టు ద్వారా 2.85 లక్షల ఎకరాల ఆయకట్టుకు 32 టీఎంసీలను కేటాయించాలని నిర్ణయించారు.
- రెండో పంటకు నీటిని విడుదల చేసే సమయానికి సోమశిల జలాశయంలో 48 టీఎంసీలు ఉండగా, పంట పూర్తయ్యే నాటికి 16 టీఎంసీలు నిల్వ ఉంటుందని అంచనా వేశారు.
- జిల్లాలో దాదాపు 1.75 లక్షల ఎకరాల్లో వరి.. 35 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వీటిలో నిమ్మ, అరటి, కొబ్బరి, బిటిల్‌లైన్ ఆకు, ఇతర కూరగాయలను సాగు చేస్తున్నారు.
- రొట్టెల పండగను సమర్థంగా నిర్వహించేందుకు గానూ నెల్లూరు చెరువుకు సోమశిల రిజర్వాయర్ నుంచి నీటిని అందించారు.
- సోమశిల రిజర్వాయర్ దిగువన పెన్నా ఒడ్డున ఉన్న అన్ని బోర్లు మంచి పరిస్థితుల్లో ఉన్నాయి. ప్రధానంగా పెన్నాకు విడుదల చేసిన నీరు.. సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద నిల్వ చేసిన నీటి కారణంగా భూగర్భ జలాలు రీచార్జవుతున్నాయి.
- సోమశిల నుంచి సకాలంలో నీటిని సరఫరా చేయడంతో నగరంలో తాగునీటికి సమస్య తలెత్తలేదు.

నేడు కళకళ



కండలేరు జలాశయం

సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ప్రాజెక్టులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. 2019 – 22 మధ్య అత్యధిక స్థాయి నీటిమట్టం 78 టీఎంసీలను సోమశిలలో నిల్వ చేశారు. కండలేరులోనూ అత్యధికంగా 61.5 టీఎంసీలను నిల్వ చేసిన ఘనత దక్కింది. చెరువులు నింపడంతో పాటు తమిళనాడు తాగునీటి అవసరాలనూ తీర్చారు. జిల్లాలో 2.26 హెక్టార్ల ఆయకట్టుకు నీటిని అందించారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. ఈ దఫా చివరి ఆయకట్టు వరకు సోమశిల ద్వారా నీటిని సరఫరా చేశారు.

జిల్లాలో ప్రాజెక్టులు: సోమశిల, కండలేరు


2.26 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు

1,746 చిన్న చెరువులు

104 మధ్య తరహా చెరువులు

68 పెద్ద చెరువులు

సోమిరెడ్డివి కాకి లెక్కలు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 1.1 లక్షల ఎకరాల్లో మాత్రమే వరిని సాగు చేశారని.. దీనికి 11 టీఎంసీలే అవసరమవుతాయని.. మిగిలిన 24 టీఎంసీల నీటి లెక్కలు తేలలేదని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కాకి లెక్కలు చెప్పుకొచ్చారు. జిల్లాలో సీనియర్ రాజకీయ నేతగా.. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవహరించిన ఈయన చెప్పిన లెక్కలపై సాగునీటి రంగ నిపుణులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పంటలో 2.85 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేలా గత ఐఏబీ సమావేశంలో తీర్మానం చేశారు. దీనికి గానూ ఇప్పటికే 28 టీఎంసీలను వినియోగించారు. జలాశయ పరిధిలోని పెన్నార్ డెల్టా, కనుపూరు, కావలి కాలువలతో పాటు ఉత్తర, దక్షిణ కాలువలకు సాగునీటిని అందిస్తున్నారు.

పారదర్శకంగా ఇంటింటి సర్వే

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు (పొగతోట): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పుల్లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు పారదర్శకంగా ఇంటింటి సర్వేను చేపడుతున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా, ఇంటింటి సర్వే ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నగరంలోని జెడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలను ప్రతి బుధవారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంటింటి సర్వే ప్రక్రియ 65 శాతం పూర్తయిందని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్వేను సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. 40 శాతం కన్నా అధికంగా ఉన్న దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే సౌలభ్యం ఉందన్నారు. వారి ఆమోదంతో ఓటర్ల జాబితాలో ప్రత్యేకంగా మార్పు చేస్తామని తెలిపారు. మరణించిన వారి విషయంలో ఫారం – 7 ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. జేసీ కూర్మనాథ్, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విజయ్‌కుమార్ రెడ్డి, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

జగనన్నకు చెబుదాం ద్వారా వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాంపై వివిధ శాఖల అధికారులతో జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిర్యాదులొచ్చిన వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 7700కుపైగా ఫిర్యాదులు రాగా, ఇందులో 80 శాతం మేర పరిష్కరించామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అశ్రద్ధ వహించే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జేసీ కూర్మనాథ్, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈఓ చిరంజీవి పాల్గొన్నారు.

లక్షిత కుటుంబానికి చేయూత

కోవూరు: తిరుమల మెట్ల మార్గంలో వన్య మృగాల దాడిలో మృతి చెందిన పోతిరెడ్డిపాళేనికి చెందిన చిన్నారి లక్షిత కుటుంబానికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. రూ.రెండు లక్షల సాయాన్ని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రకటించగా, ఈ నగదును చిన్నారి తల్లిదండ్రులు దినేష్, శశికళ దంపతులకు డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అందజేశారు. వారి కుటుంబానికి ఎమ్మెల్యే అన్ని విధాలా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ నలబోలు సుబ్బారెడ్డి, సర్పంచ్ శ్రీవాణి, సచివాలయ కన్వీనర్ కవరగిరి ప్రసాద్, చిరంజీవి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సీఐలుగా పదోన్నతి

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్‌లో పనిచేస్తున్న పలువురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ రేంజ్ ఐజీ పాలరాజు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. కోవూరు ఎస్సై వెంకటేశ్వరరావు, లింగసముద్రం ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు, ఉమ్మడి నెల్లూరు జిల్లా పెళ్లకూరు ఎస్సై కృష్ణారెడ్డి పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

- ముగ్గురు ఆర్‌ఎస్సైలు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)లుగా పదోన్నతి పొందారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో విధులు నిర్వర్తిస్తున్న గోపీనాథ్, ఏఆర్ విభాగంలో ఉన్న నారాయణరెడ్డి, కృష్ణయ్య పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. గోపీనాథ్‌ను తొలుత ఆక్టోపస్‌కు కేటాయించి అక్కడి నుంచి బాపట్ల జిల్లా ఆర్‌ఐగా నియమించారు. నారాయణరెడ్డిని పల్నాడు జిల్లాకు, కృష్ణయ్యను ఎస్పీఎఫ్ ఆర్‌ఐలుగా నియమించారు. త్వరలోనే వీరు రిలీవై తమకు కేటాయించిన ప్రాంతాల్లో రిపోర్ట్ చేయనున్నారు.

థాంక్యూ సీఎం సార్..



నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో 2014 జూన్ రెండు నాటికి పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలనే నిర్ణయంపై కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సంబరాలను బుధవారం నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరించాలనే నిర్ణయం తీసుకోవడంపై సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 1900 మందికి లబ్ధి చేకూరిందని తెలిపారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ జిల్లా నేతలు లలితారెడ్డి, సుదర్శన్‌రావు, విజయకుమారి, సుధారాణి, శ్రీనివాసులు, శాంతిస్వరూప, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15కు పంట నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు



మాట్లాడుతున్న సుధాకర్‌రాజు

కొడవలూరు: పంట నమోదును సెప్టెంబర్ 15 నాటికి వంద శాతం పూర్తి చేయడంతో పాటు సంబంధిత రైతుల ఈ – కేవైసీని సైతం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు సూచించారు. కొడవలూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వీఏఏలతో బుధవారం సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్బీకేల్లో ఎరువుల నిల్వలు తగినంతగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్బీకేల్లో ఎరువుల కొరత ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన రైతులకు ఈ – కేవైసీని పూర్తి చేయించాలని ఆదేశించారు. ఏడీఏలు నర్సోజీ, సుజాత, ఏఓ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయండి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో అర్హులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటి సర్వేను కచ్చితంగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులను జారీ చేసి మూడు రోజుల్లో వివరణ తీసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వేలో కొందరు బీఎల్‌ఓలు ఉత్తమ ప్రతిభ చూపారని, వీరిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలతో బీఎల్‌ఓలు సమన్వయం చేసుకొని జాబితాలో ఎలాంటి తప్పిదాల్లేకుండా చూడాలని సూచించారు. ఏఈఆర్వో నిర్మలానందబాబా, దేవీకుమారి, దశయ్య, ధనుంజయ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మరింత భరోసా

- జిల్లాకు 10,404 రేషన్ కార్డుల మంజూరు
- లబ్ధిదారులకు ఈ – కేవైసీ చేస్తున్న వలంటీర్లు
- ఈ నెల నుంచే రేషన్ పంపిణీ



నెల్లూరు (దర్గామిట్ట): పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అర్హులై ఏదైనా కారణంతో సంక్షేమ పథకాలు పొందని వారిని గుర్తించి బై యాన్యువల్ శాంక్షన్ ద్వారా లబ్ధి చేకూరుస్తోంది. ఇందులో బాగంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి రేషన్ కార్డులను మంజూరు చేసింది. జిల్లాలో కొత్తగా 10,404 కార్డుల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వలంటీర్లు వెళ్లి ఈ – కేవైసీ తీసుకుంటున్నారు. అనంతరం కార్డును అందజేయనున్నారు. కొత్త కార్డులకు ఈ నెల నుంచే బియ్యం, నిత్యావసర సరుకులను అందించనున్నామని అధికారులు తెలిపారు.

10,560 దరఖాస్తులు..

రేషన్ కార్డుల కోసం 10,560 మంది దరఖాస్తు చేసుకోగా, 10,404 మందికి మంజూరైంది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో ప్రస్తుతం 7.22 లక్షల రేషన్ కార్డులుండగా, వీటిని కొత్తగా 10,404 కార్డులు జమయ్యాయి.

డౌన్‌లోడ్ ప్రక్రియ వేగవంతం

జిల్లాకు మంజూరైన కొత్త రేషన్ కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 7,411 కార్డులను డౌన్‌లోడ్ చేశారు. మిగిలిన ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎస్డీటీలను ఉన్నతాధికారులు ఆదేశించారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను ఈ – కేవైసీ అనంతరం లబ్ధిదారులకు అందజేయనున్నారు.

రెవెన్యూ డివిజన్	మండలాలు	కొత్తగా మంజూరైన కార్డులు
నెల్లూరు	12	4,484
కావలి	12	2,589
కందుకూరు	07	1,663
ఆత్మకూరు	09	1,668
మొత్తం	40	10,404

ఇంటి వద్దకే రేషన్ కార్డులు



జిల్లాకు నూతనంగా 10,404 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. డౌన్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతోంది. రేషన్ కార్డులకు సంబంధించి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి ఈ – కేవైసీ చేస్తున్నారు. ఇది పూర్తయ్యాక అందజేయనున్నారు. కార్డు పొందిన వారందరికీ సరుకులను పంపిణీ చేయనున్నాం.

– కూర్మనాథ్, జేసీ

ఉద్యోగుల గ్రీవెన్స్ రేపు

నెల్లూరు(దర్గామిట్ట): ప్రతి నెలా మూడో శుక్రవారం ఉదయం 10.30కు కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. పదోన్నతులు, సీనియార్టీ, ఇంక్రిమెంట్లు, తదితర సమస్యలపై అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు.

పవన్‌వి పిచ్చి మాటలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలనను చూసి పవన్‌కు పిచ్చిపట్టిందని, అందుకే ప్రజాకోర్టు పేరుతో పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నాడని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఏమైనా సమస్యలొస్తే సకాలంలో పరిష్కారం అవుతుందని, అయితే పవన్ ప్రజాకోర్టు పేరుతో పిచ్చి పనులకు పూనుకుంటున్నట్లు తెలిపారు. అసలు ప్రజాకోర్టు అవసరమే లేదని, సినిమాలో మాదిరిగా నిజ జీవితం కూడా ఉంటుందనుకోవడం హాస్యాస్పదమన్నారు. ముందుగా పవన్ మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో ఏ మహిళ కూడా ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. వీటిని గుర్తించకుండా పవన్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ముందుగా తాను ఎక్కడ నుంచి పోటీ చేస్తాడో చెప్పాలన్నారు. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదవడం కాకుండా సొంతంగా ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. ఎవరెన్ని చేసినా ప్రజల పూర్తి మద్దతు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉందన్నారు. అందుకే గత ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతో పాటు 22 పార్లమెంటు స్థానాలు అందించారన్నారు. రాబోయే రోజుల్లో రెట్టింపు ఫలితాలు రానున్నాయని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి పాల్గొన్నారు.

అభ్యర్థుల్లేక బాబు, పవన్ చీకటి పొత్తు

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండటంతో చంద్రబాబు, పవన్‌కు అభ్యర్థులు కరువయ్యారని, అందువల్లే వారు చీకటి పొత్తులు పెట్టుకుంటున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బున్న కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు తమ పార్టీలో చేరి అభ్యర్థులుగా నిలబడుతారనే ఆశతో బాబు, పవన్ కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నీచమైన భాష వాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మనస్సులు గెలుచుకోలేక రాష్ట్రంలో ఉద్రిక్తతలు సృష్టించేందుకు వారు చిల్లర వేషాలు వేస్తున్నారని చెప్పారు. అందుకే నిత్యం ఎల్లో మీడియాలో విషపు రాతలు రాయిస్తూ మైండ్‌గేమ్ ఆడుతున్నారన్నారు. ప్రస్తుతం విజన్ 2047 అంటూ కొత్త పల్లవి అందుకున్న చంద్రబాబు, గతంలో విజన్ 2020ను ఏమి చేశారని ప్రశ్నించారు. నిర్దిష్ట లక్ష్యాలు సాధించడానికి, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా పాలన సాగిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో మరో వందేళ్లకు అవసరమైన సామాజిక మార్పులకు పునాదులు వేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న పారిశ్రామిక కారిడార్లు, సముద్ర తీరంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఇవన్నీ బాబు విజన్ 2020లో ఎందుకు లేవని నిలదీశారు. బాబు అబద్ధాలను ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే రామిరెడ్డి తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి : రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధి కోసమే ప్రభుత్వం నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిరుమలాపురం సచివాలయ పరిధిలోని దుంపవారిపల్లి, గుడినరవ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. పలువురు ఆయన దృష్టికి తెచ్చిన వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల ఏమైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీష్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు అంబటి భాస్కర్‌రెడ్డి, జి.తిరుపతి, సుభాని, సర్పంచ్‌లు కె.కృష్ణ, వెంకటేశ్వర్లురెడ్డి, గౌస్‌మొహిద్దీన్, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాని, మాజీ సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, జి.ఓబుల్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ మూలె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న సామూహిక వరలక్ష్మి వ్రతం



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 25వ తేదీన మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. ఆలయంలోని చైర్మన్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుందన్నారు. ఆగస్టు నెలలో రెండు శుక్రవారాలు, సెప్టెంబర్ నెలలో రెండు శుక్రవారాల పాటు ఈ మాసం కొనసాగుతుందన్నారు. అమ్మవారికి ఇష్టమైన ఈ మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఈ మాసంలో రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మరుగుదొడ్లు, క్యూలైన్, భోజన వసతి, గదులను ఏర్పాటు చేస్తామన్నారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈనెల 25న జరుగనున్న సామూహిక వరలక్ష్మి వ్రతానికి మహిళా భక్తులు ముందుగానే ఆన్‌లైన్‌లో లేదా దేవస్థానం కౌంటర్ వద్ద బుక్ చేసుకోవాలని కోరారు. అలా బుక్ చేసుకున్న వారికి వరలక్ష్మి వ్రతంలో పాల్గొనే సమయంలో ఉచితంగా పూజా సామగ్రిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రగతే లక్ష్యం

• సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగర నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 39వ డివిజన్ బెస్తపాళెం, చాముండివారితోట, రాజా గారివీధి తదితర ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి సంబంధించి అదనంగా మరో రూ.20 లక్షలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారని, దీనిద్వారా పెండింగ్ లేకుండా అన్ని పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో మూడు సచివాలయాలు పర్యటిస్తే గడప గడపకు పూర్తవుతుందన్నారు. నగర నియోజకవర్గానికి సంబంధించి అప్పు కాకుండా, ప్రజలపై భారం పడకుండా గతంలో, ప్రస్తుతం ఎంత నిధులు తీసుకొచ్చామో, ఏ ఏ అభివృద్ధి పనులు చేశామో చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. నాలుగన్నరేళ్లుగా కనిపించని ఓ వ్యక్తి ప్రస్తుతం ప్యాకేజీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలో లోకేశ్ పాదయాత్ర సమయంలో ప్రతి నియోజకవర్గంలో తన నామస్మరణే చేశారని, దీనిని బట్టి తాను బలవంతుడినా.. కాదా వారే అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, వైఎస్సార్‌సీపీ నేతలు మానికల సునీల్, నూనె ప్రసాద్, మల్లి నిర్మల పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల): అన్నివర్గాల సంక్షేమం, గ్రామల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలం చిలకలమర్రి సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. తొలుత మహిళలు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. బుక్‌లెట్‌లు అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాల గురించి అడుగగా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. చిలకలమర్రి సచివాలయ పరిధిలో రూ.10.79 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందినట్లు తెలియజేశారు. విద్యాభివృద్ధి కోసం అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, రైతుల కోసం రైతు భరోసా, అక్క చెల్లెమ్మల కోసం వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న చేదోడు, సున్నావడ్డీ పథకాలను అందజేస్తున్నారన్నారు. ఎంపీపీ పెయ్యాల సంపూర్ణమ్మ, జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కేతా రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి, శాప్ డైరెక్టర్ కాల్వ నర్సింహులు, వైఎస్సార్‌సీపీ నేతలు పి.వెంకటరమణయ్య, జి.మల్లికార్జున, సర్పంచ్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

• ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి



నెల్లూరు (టౌన్) : కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగుల జీవితంలో ఇది మర్చిపోలేని రోజుగా అభివర్ణించారు. 2014కు ముందు ఉన్న వారిని రెగ్యులర్ చేయడం అభినందనీయమన్నారు. 2014 నాటికి ఐదేళ్ల నిబంధన ఎత్తివేస్తే కాంట్రాక్టు అధ్యాపకులందరూ రెగ్యులర్ అవుతారన్న ప్రతిపాదనను గతంలో సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇన్ని వేల మందికి జీవితాన్ని ప్రసాదించిన ప్రభుత్వంలో టీచర్ ఎమ్మెల్సీగా ఉండటం నా అదృష్టమన్నారు.

విద్యార్థి అదృశ్యం



సాయినాథరెడ్డి

కందుకూరు: స్కూల్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వచ్చిన విద్యార్థి కనిపించకుండా పోయిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. విద్యార్థి బంధువుల కథనం మేరకు.. పందలపాడు గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి కుమారుడు సాయినాథరెడ్డి పట్టణంలోని ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం స్కూల్‌కు వెళ్లేందుకు గ్రామం నుంచి ఆటోలో వచ్చాడు. బుక్స్ కొనుక్కోవాలని చెప్పి పోస్టాఫీస్ సెంటర్‌లో ఆటో దిగాడు. ఆ తర్వాత స్కూల్‌కి వెళ్లలేదు. ఇంటికీ రాలేదు. దీంతో అప్పటి నుంచి తల్లిదండ్రులు, బంధువులు విద్యార్థి ఆచూకీ కోసం గాలిస్తున్నా ప్రయోజనం లేదు. ఈ నేపథ్యంలో సమాచారం తెలిసిస్తే 91545 90041, 93982 53342 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని బుధవారం విజ్ఞప్తి చేశారు.

ఆటో, లారీ ఢీ

• ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు

ఉలవపాడు: కూలికి ఆటోలో వెళ్లి మరో అరగంటలో ఇంటికి చేరుకునేలోపు కూలీల జీవితాల్లో ప్రమాదం ముంచుకొచ్చింది. ఈ ఘటన జాతీయ రహదారిపై మన్నేరు బ్రిడ్జి సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని చాకిచర్ల శ్రీరామపురానికి చెందిన గిరిజనులు కందుకూరుకు కర్రల కోత పనికెళ్లారు. అనంతరం ఇంటికి బయల్దేరారు. ఈ సమయంలో పెరల్ డిస్టిలరీ నుంచి మద్యం లోడుతో వెళ్తున్న లారీ బ్రిడ్జి దిగుతున్న సమయంలో బ్రేక్ వేసింది. దీంతో పక్కనే ఉన్న ఆటో, లారీ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటో తిరగబడింది. ఆటోలో ముందు కూర్చొని ఉన్న మానికల వెంకయ్య (32) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న పెంచలయ్య పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన డ్రైవర్ మస్తాన్, సీతమ్మ, సువార్త, సుబ్బారావు, జ్ఞానయ్యను ఒంగోలు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. హైవే అంబులెన్స్‌తో పాటు రెండు 108 అంబులెన్స్‌లలో క్షతగాత్రులను పంపించారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

పొదలకూరు

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8

నెల్లూరు

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ :	రూ.143
లేయర్ :	రూ.105
బ్రాయిలర్ చికెన్ :	రూ.244
స్కిన్‌లెస్ చికెన్ :	రూ.270
లేయర్ చికెన్ :	రూ.178

ప్రారంభానికి సిద్ధంగా 12 వేల ఇళ్లు

• కలెక్టర్ హరినారాయణన్

వెంకటాచలం : జిల్లాలోని జగనన్న కాలనీల్లో ఈ నెలాఖరులోగా 12 వేల ఇళ్లను ప్రారంభోత్సవానికి ముస్తాబు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటాచలం, కసుపూరు, కంటేపల్లి, గొలగమూడి, అనికేపల్లి గ్రామాల్లో కలెక్టర్ బుధవారం పర్యటించారు. తొలుత వెంకటాచలం సమీపంలోని జగనన్న కాలనీని పరిశీలించారు. కాలనీలో పూర్తయిన ఇళ్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల స్థలాలు ఇచ్చి పెద్ద ఎత్తున ఇళ్లు కట్టిస్తుందన్నారు. జిల్లాలో 85 వేల ఇళ్లు మంజూరయ్యాయని, ఇంటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నెలాఖరుకు 12 వేల ఇళ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. వెంకటాచలం లేఅవుట్‌లో అన్ని వసతులతో 100 ఇళ్లను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అన్ని జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలకు వీలుగా నీటికి ఇబ్బందులు తలెత్తకుండా బోర్లు, పైపులైన్ల ఏర్పాటుకు రూ.14 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్, విద్యుత్ సౌకర్యం, రోడ్లు మొదలైన వసతులు కల్పించామని పేర్కొన్నారు.



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల గురించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పిల్లలందరూ బడికి వచ్చేలా చూడాలి

బడి ఈడు పిల్లలందరూ బడికి వచ్చేలా ఉపాధ్యాయలు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. మండలంలోని కసుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొలగమూడిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి ప్రతి విద్యార్థి జగనన్న విద్యాకానుక కిట్ల ద్వారా ఇచ్చిన షూలు, యూనిఫామ్ తప్పనిసరిగా వేసుకురావాలని, ట్యాబ్‌లను పాఠశాలలకు తీసుకొచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రకారం చైల్డ్ ఇన్ఫోలో నమోదైన బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

పక్కాగా ఓటరు సర్వే చేపట్టాలి

బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది పక్కాగా ఓటరు సర్వే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కంటేపల్లి, అనికేపల్లి సచివాలయాలను సందర్శించిన కలెక్టర్ ఎక్కడా లోటుపాట్లు లేకుండా పక్కాగా ఓటరు సర్వే చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను పరిశీలించి ఓటర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జాబితాలో చేర్పులు, మార్పులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలియజేశారు. పొరపాట్లు చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. కంటేపల్లిలో క్షేత్రస్థాయిలో ఇంటికి వెళ్లి ఓటరు సర్వేను పరిశీలించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ నాగరాజు, డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ వెంకటరమేష్, ఎలక్షన్ డీటీ కామేష్, ఇంజనీరింగ్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

• సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

బుచ్చిరెడ్డిపాళెం : 39వ రాజ్యాంగ అధికారణ ప్రకారం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి, అంగవైకల్యం ఉన్న వ్యక్తులకు ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వాణి తెలిపారు. మండలంలోని జొన్నవాడ గిరిజన కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు సదస్సును నిర్వహిస్తామన్నారు. దీని ద్వారా న్యాయపరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు ప్రజలకు వివరించామన్నారు. అలాగే తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయరాదని హితవు పలికారు. ఇందుకోసం 2007లో చట్టాన్ని రూపొందించారని గుర్తుచేశారు. అలాగే పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని ఆదేశించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెంచల శ్యామ్, ఐటీడీఏ అధికారిణి ప్రమీల, డీటీ విజయ్, లీగల్ వలంటీర్లు సురేంద్ర, వేణుగోపాల్‌లు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న జడ్జి వాణి

వైద్యశాలల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

ఉదయగిరి: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. బుధవారం ఆయన గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాల పరిసరాలు, గదులను, రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు.



కాన్పు చేయించుకున్న పుష్పతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

ఆరోగ్య కేంద్రంలో తొలికాన్పు

గండిపాళెం పీహెచ్‌సీలో పుష్కర కాలం తర్వాత బుధవారం ఓ మహిళకు తొలికాన్పు జరిగింది. సుమారు 12 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు వైద్యశాలలో ఒక్క కాన్పు కూడా జరగలేదు. ప్రస్తుత వైద్యాధికారిణి శివకల్పన ఆధ్వర్యంలో ఉదయగిరికి చెందిన పుష్పకు కాన్పు చేయగా ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యాధికారిణి తెలిపారు. సిబ్బందిని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అభినందించి సేవలను విస్తృత పరచాలని సూచించారు. అంతకు ముందు ఆయన ఉదయగిరి దిలావర్‌బావి వీధిలో అతిసారా, జ్వరాలపై సిబ్బందితో సర్వే చేయించారు. సీహెచ్‌ఓ శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

మద్యంతో పట్టుబడితే.. కేసు మాఫీ?

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని తమిదపాడులో మంగళవారం రాత్రి ఓ బెల్ట్ షాపుపై పోలీసులు దాడులు చేయగా మద్యంతో పట్టుబడిన విక్రయదారుడిపై కేసు నమోదు చేయకపోవడం వివాదంగా మారింది. 26 మద్యం సీసాలు దొరికినట్లు స్థానికులు చెబుతుండగా, కేవలం 15 సీసాలు మాత్రమే పట్టుబడినట్లు పోలీసులు చెబుతున్నారు. మరో వైపు మద్యం విక్రేతపై కేసు నమోదు చేయకపోవడంపై పోలీసులు పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. నిందితుడు అనారోగ్యంతో ఉండడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా.. సెబ్, పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సందేశాత్మక చిత్రం 'యూనివర్సిటీ'

• నటుడు ఆర్.నారాయణమూర్తి

కావలి : దేశంలో విద్య, వైద్యం ప్రభుత్వమే నిర్వహించాలనే అంశంపై తీసిన సందేశాత్మక చిత్రం 'యూనివర్సిటీ' అని, దీనికి తానే నటుడుగా, నిర్మాతగా, దర్శకుడిగా వ్యహరించినట్లు నటుడు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కావలిలోని జవహర్ భారతి కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. మనిషికి విద్య, వైద్యం ఎంతో అవసరమని, ఇవి ప్రైవేట్ రంగంలో ఉండటం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. వీటిని జాతీయం చేయాలనే సందేశాత్మక చిత్రం 'యూనివర్సిటీ'ని నిర్మించినట్లు చెప్పారు. దీంతో పాటు హిందీ కంటే ఇంగ్లిష్ ఎందుకు ప్రాధాన్యమైనది అనే విషయాలను కూడా ఈ చిత్రం వివరిస్తుందన్నారు. ఎంతో మంది సంఘ సంస్కర్తలు, స్వాతంత్ర్య సమర యోధులు ఇంగ్లిష్ విద్య ప్రతిఒక్కరికీ అవసరమని చెప్పినట్లు గుర్తుచేశారు. దీనిని ఈ సినిమా ద్వారా వివరించినట్లు తెలియజేశారు. అలాగే నిరుద్యోగం పెరిగిపోతున్న మన దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల కలిగే అరిష్టాలను ఈ చిత్రం ద్వారా వివరించామన్నారు. అక్టోబర్ 4న చిత్రం విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌తో ఆర్.నారాయణమూర్తి

బూడిద లారీ బోల్తా



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు–పొంగూరుకండ్రిక మధ్య 67వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం నెల్లూరు నుంచి నంద్యాలకు బూడిద లోడుతో వెళ్తున్న భారీ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడ్డాడు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని లారీ బోల్తాపడిన ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

డీపీఓ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్) : ఎవరో చేసిన తప్పునకు తనను నిందించడం, వేధింపులకు గురి చేస్తుండడంతో మనస్తాపానికి గురైన జిల్లా పోలీసు కార్యాలయ ఉద్యోగి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సేకరించిన వివరాల మేరకు.. నెల్లూరు నగరం మూలాపేటకు చెందిన కోటేశ్వరరావు జిల్లా పోలీసు కార్యాలయంలో టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. పే సెక్షన్‌లో పనిచేసే హోంగార్డు ఉత్పన్ నాథ్ రాజ్ ఉన్నతాధికారులకు తెలియకుండా రూ.కోట్లలో నగదు కాజేయడం, పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి నగదు రికవరీ చేసిన విషయం విధితమే. ఈ ఘటనలో అధికారుల పాత్రపై విచారణ సాగుతోంది. ఈ క్రమంలో టైపిస్టు నిర్లక్ష్యం వల్లనే తప్పు జరిగిందంటూ కొందరు అధికారులు కోటేశ్వరరావును నిందించసాగారు. ఎలాంటి సంబంధం లేకపోయినా తనను నిందించడం, ఎక్కడ ఇబ్బందులకు గురి చేస్తారో అని ఆయన భయపడుతుండే వాడని, సహచర సిబ్బంది అతనికి ధైర్యం చెబుతుండేవారని తెలిసింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట పే సెక్షన్‌లోని అధికారులు ఆయన్ను తీవ్ర దుర్భాషలాడారని, దీంతో మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇంటికి వచ్చి కుప్పకూలిపోవడంతో కుటుంబ సభ్యులు అతన్ని హుటాహుటిన చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు రహస్యంగా విచారిస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

వెంకటాచలం: రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి చెముడుగుంట వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. అదే సమయంలో గూడూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ల చోరీ

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు–2 గ్రామ సచివాలయంలో రెండు కంప్యూటర్లు చోరీకి గురైంది. పోలీసుల కథనం మేరకు.. ఎప్పటిలానే సిబ్బంది విధులకు హాజరయ్యేందుకు బుధవారం ఉదయం సచివాలయానికి వచ్చారు. కార్యాలయంలో చూసేసరికి తలుపు పగులుగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా రెండు కంప్యూటర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం: కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బి.రాజా(31) అనే వ్యక్తి బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కాకుటూరు గ్రామానికి చెందిన రాజా కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 10న తన నివాసంలో తల్లి రమణమ్మ, భార్య పావనితో గొడవ పడ్డాడు. మనస్తాపానికి గురైన రాజా పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.